సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



ఆదినాయకా... అందుకో మా పూజ

ఆదినాయకా.. అందుకో మా పూజ అంటూ వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే వేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి..


8లో



చోరీ కేసును ఛేదించిన పోలీసులు

చోరీ కేసును తుని పోలీసులు ఛేధించారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వివరాలు వెల్లడించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,98,313క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు వచ్చాయి. ఉదయం నుంచి అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఆయనకు నేరుగా తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఎస్పీ నరసింహకిశోర్ అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి అర్జీలను పరిశీలించి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో నేరుగా మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఉత్తర్వులిచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, ఇతర కేసులకు ఉన్నాయి. అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు



దేవరపల్లి మండలం త్యాజంపూడి సొసైటీ వద్ద యూరియా కోసం వేచిఉన్న రైతులు

దేవరపల్లి: ఖరీఫ్‌లో వరి పంటకు ప్రధానంగా వాడుతున్న యూరియా ఎరువు కొరత ఏర్పడింది. దేవరపల్లి మండలంలోని త్యాజంపూడి సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు రెండు రోజులుగా పడిగాపులు పడుతున్నారు. ఆదివారం గ్రామంలోని రైతులంతా సొసైటీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో రైతుల మధ్య తోపులాటలు, నెట్టుకోవడం, కొట్లాటకు దారి తీసింది. కూటమి ప్రభుత్వ సానుభూతి పరులు, అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు ఎక్కువ బస్తాలు ఇస్తున్నారని, చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వడంలేదని రైతులు ఆరోపించారు. రైతులు ఆందోళనకు దిగడంతో యూరియా పంపిణీ నిలిపివేశారు. రైతుకు అరబస్తా చొప్పున సోమవారం పంపిణీ ప్రారంభించారు. యర్నగూడెం, త్యాజంపూడి సొసైటీలో అరబస్తా చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నారు. త్యాజంపూడి సొసైటీలో 12.5 మెట్రిక్ టన్నులు, యర్నగూడెం సొసైటీలో 12.5 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు ఎకరాకు అరబస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. రెండు రోజుల్లో మరొక 50 టన్నుల యూరియా వస్తుందన్నారు. మోతాదుకు మించి యూరియా వాడడం వల్ల కొరత ఏర్పడిందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సిఫారసు ప్రకారం ఎకరాకు మొదటి దఫాగా అర బస్తా యూరియా వేయవలసి ఉంది. పొట్టదశలో రెండవ దఫాగా అర బస్తా ఎరువు వేయాలి.

అక్టోబర్ 7న తెలుగు సాహిత్య సదస్సు

రాజానగరం: పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురంలోని వైఎన్ కళాశాలలో అక్టోబర్ 7న ×తెలుగు సాహిత్యం – భాషా బోధన మనోవికాసం? అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరుగనుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని సోమవారం విడుదల చేశారు. ప్రాచీన సాహిత్యం, ప్రబంధ సాహిత్యం, దక్షిణాంధ్రయుగ సాహిత్యం, శతక సాహిత్యం, ఆధునిక సాహిత్య ప్రక్రియలు, జానపద, గిరిజన విజ్ఞానం, ప్రాథమిక, ఉన్నత విద్య, మాతృ భాష బోధన అంశాల పై పరిశోధన పత్రాలను సెప్టెంబర్ 25లోపు పంపించాలన్నారు. కార్యక్రమంలో సెమినార్ డైరెక్టర్ డాక్టర్ పిట్టా శాంతి పాల్గొన్నారు.

ఎలా జీవించాలి



రాజమహేంద్రవరం పదో వార్డుకు చెందిన ఇరాంకి పురుషోత్తం దివ్యాంగుడు. కుడికాలు అంగవైకల్యానికి గురైంది. ఇతను అనాథ. కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. వివాహం కాలేదు. వచ్చే రూ.4 వేల పింఛనుతో తన పోషణ చూసుకునేవాడు. పింఛనే ఆధారంగా బతుకుబండి లాగుతున్నాడు. రీ వెరిఫికేషన్‌లో గతంలో 78 శాతం ఉన్న వైకల్యాన్ని ప్రస్తుతం 30 శాతానికి తగ్గించేశారు. దీంతో పింఛను ఆగిపోయింది. ఏ ఆధారం లేని తనకు పింఛను కూడా లేకపోతే ఎలా జీవించాలంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు.

పరీక్ష నిర్వహించకుండానే వైకల్య శాతం తగ్గింపు



ధవళేశ్వరం గ్రామానికి చెందిన యాదంరెడ్డి కొండలరావు మానసిక దివ్యాంగుడు. 2007 సంవత్సరంలో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో 50 శాతం మానసిక వైకల్యంతో ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి దివ్యాంగుల కోటాలో పింఛను పొందుతున్నారు. టీడీపీ గత ప్రభుత్వంలో పదేళ్ల ఇదే వైకల్య శాతంతో పింఛను వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సైతం పింఛను అందింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రీ వెరిఫికేషన్‌లో ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే 25 శాతం వైకల్యం ఉన్నట్లు రాసేశారని ఆయన బంధువు ఆవేదన చెందుతున్నారు. ఏ ఆర్థిక ఆధారం లేని తమకు తిరిగి పింఛను పునరుద్ధరించాలని కోరింది.

ఆసరాకు ఎసరు



చిత్రంలోని మానసిక దివ్యాంగ చిన్నారి పేరు గంర్రేటి చంద్రిక. వయసు 12 ఏళ్లు. రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. మానసిక వైకల్యం 90 శాతం ఉన్నట్లు వైద్యులు ధృవీకరణ పత్రం ఇచ్చారు. పింఛను రూ.6 వేలు అందుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీ వెరిఫికేషన్‌లో 100 శాతం వైకల్యం ఉన్నట్టు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ ప్రస్తుతం పింఛను ఆపేయడంతో చిన్నారి తల్లి ఆవేదన చెందుతోంది. ఒక్కసారిగా పింఛను ఎందుకు ఆపేశారంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. తమకున్న ఆర్థిక భరోసా తీసేశారంటూ వాపోతోంది.

దివ్యాంగులపై నిర్దయ

- అనర్హత పేరుతో నోటికాడ కూడును లాగేస్తున్న కూటమి సర్కారు
- వైకల్యం శాతం తగ్గించి మరీ కుట్ర
- నిర్దాక్షిణ్యంగా పింఛన్ల తొలగింపు
- తామేం తప్పు చేశామంటూ కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల నిరసన
- తమ జీవితాలపై ప్రభుత్వం దెబ్బ కొట్టిందంటూ మండిపాటు



కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ధర్నాకు సంఘీభావం తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

సాక్షి, రాజమహేంద్రవరం/సీటీఆర్ఐ: దివ్యాంగులపై కూటమి సర్కారు నిర్దయగా వ్యవహరిస్తోంది. వైకల్య శాతం తగ్గించేసి అనర్హత పేరుతో అడ్డగోలుగా పింఛన్లు తొలగిస్తోంది. వారికి ఆర్థిక ఆసరాను అందకుండా చేస్తోంది. పూర్తిగా మంచానికే పరిమితమైనా.. మానసిక వికలాంగులుగా ఉన్నా.. కనీస కనికరం లేకుండా నోటికాడ కూడును లాగేస్తోంది. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్న వారి పింఛన్లు మార్పుచేస్తూ తీరని వేదన మిగులుస్తోంది. కూటమి ప్రభుత్వ చర్యలతో దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు. నాడు ఉన్న అర్హత నేడు ఎక్కడికి వెళ్లిందంటూ కన్నీళ్లు పెడుతున్నారు. ఏ ఆధారం లేని తమకు ఆర్థిక ఆధారం లేకుండా చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పరంగా, పార్టీల పరంగా ఏమైనా ఉంటే వాళ్లతో తేల్చుకోవాలే తప్ప.. దివ్యాంగులను టార్గెట్ చేయడం తగదని ప్రభుత్వానికి హితవు పలుకుతున్నారు. తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని, వైకల్యం తక్కువగా ఉందన్న నోటీసులు వెనక్కు తీసుకోవాలని దివ్యాంగులు కోరుతున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఓ సీతారామమూర్తికి అందించారు. దివ్యాంగుల ఆందోళనకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, రూరల్ మండల అధ్యక్షుడు చాపల రాజా మద్దతు తెలిపారు.

పింఛన్లు తగ్గించేందుకు కుట్ర

కూటమి ప్రభుత్వం అత్యంత పాశవికంగా వ్యవహరిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు ఇస్తామంటున్న ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం. 4 లక్షల పింఛన్లకు కోత వేసేందుకు దివ్యాంగులపై ప్రతాపం చూపుతున్నారు. వాళ్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేరని వారిని టార్గెట్ చేశారు. తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో 3,211 పింఛన్ల తొలగింపు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల మేరకు 33,688 మంది దివ్యాంగ కేటగిరిలో ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారు. వారిలో 1,321 మంది వివిధ రకాల హెల్త్ పింఛన్లు (రూ.15 వేలు) తీసుకుంటున్నారు. మిగిలిన 32,367 మంది రూ.6 వేల పింఛను పొందుతున్నారు. పింఛన్ల తొలగింపులో భాగంగా 19,928 మందికి సంబంధించిన వైకల్య శాతం తిరిగి పరిశీలించారు. వారిలో 3,211 మందికి ప్రభుత్వ నిబంధనల మేరకు వైకల్య శాతం లేదని నిర్ధారించారు. వీరిని అనర్హులుగా గుర్తించి పింఛన్లు రద్దు చేసినట్లు ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నోటీసులు అంటించారు.

దివ్యాంగులపై ఇంత దారుణమా?



కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై ఇంత కక్ష గడుతుందని అనుకోలేదు. పింఛన్లు తగ్గించుకునేందుకు ఏ ఆధారంలేని దివ్యాంగులపై కుట్ర చేయడం దారుణం. అంగ వైకల్య శాతం తగ్గించి మరీ పింఛన్లు తీసేయడాన్ని బట్టిచూస్తే దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోంది. అంగ వైకల్యం ఎప్పుడూ ఒకేలా ఉంటుంది కానీ.. ఇప్పుడు తగ్గిపోయిందని అనడం దారుణం. ఉన్న ఆర్థిక ఆసరాను లాగేస్తే తామెలా బతకాలంటూ వారు కన్నీరుమున్నీరవుతున్నారు. అయినా ప్రభుత్వం కనికరించడం లేదు. తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– సబ్బెళ్ల దుర్గావిజయరెడ్డి, వికలాంగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు

ఎవరూ పని ఇవ్వడం లేదు



రాజమహేంద్రవరం నగరం 17వ వార్డుకు చెందిన లద్దిక సునీత దివ్యాంగురాలు. భర్త మృతి చెందారు. అగ్ని ప్రమాదంలో ముఖం కింది భాగం పూర్తిగా కాలిపోయింది. 2010లో 65 శాతం వైకల్యంతో పింఛను మంజూరు చేశారు. అప్పటి నుంచి పింఛను డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ప్రస్తుతం రీ వెరిఫికేషన్‌లో వైకల్య శాతం 40కు తగ్గించారు. దీంతో పింఛను పోయింది. తన ఆకారాన్ని చూసి ఎవరూ పని ఇవ్వడం లేదని, వచ్చే పింఛను డబ్బుతో బతికేదాన్నని.. అది కూడా లేకుండా చేశారంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఇప్పుడు తాను ఎలా బతకాలని ఆవేదన చెందుతోంది.

కదం తొక్కిన విద్యార్థులు

- గెంటివేసిన పోలీసులు
- సమస్యల పరిష్కారం కోసం వస్తే గెంటేస్తారా అని ఆందోళన
- ప్రభుత్వ తీరుపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విద్యార్థులు సమస్యలు చెప్పుకుందామని కలెక్టరేట్‌కు వస్తే పోలీసులు అడుగడుగునా జులుం చూపించారు. వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు కలెక్టరేట్ ప్రాంగణం బయట తమ డిమాండ్‌లను నేరవేర్చాలని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అత్యుత్సాహం చూపించారు. అక్కడ ఉన్న విద్యార్థులను గెంటివేశారు. విద్యార్థులకు, పోలీసులకు మధ్య కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఒక్కసారిగా విద్యార్థులను పక్కకు లాగివేయడంతో విద్యార్థులు పోలీసులు డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒకపక్క విద్యార్థులు, మరో వైపు పోలీసుల అరుపులు, కేకలతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సుమారు 1,000 మంది విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. న్యాయమైన తమ డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోసం వస్తే పోలీసులతో నెట్టివేయడం ఎంత వరకు సమంజసమని విద్యార్థులు ఆవేదన చెందారు. విద్యార్థి సంఘ నాయకులను చొక్కా పట్టుకొని లాగడమే కాకుండా దూరంగా లాక్కెళ్లిపోయారు.

ప్రభుత్వ కళాశాలలో ఫీజులు చెల్లించాలని హుకుం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకుండానే ముందస్తుగానే ఫీజులు కట్టమని వేధింపులకు గురిచేస్తున్నారని విద్యార్థులు ఆవేదన చెందారు. ప్రభుత్వం ఫీజు సొమ్ము తమ బ్యాంకు ఖాతాలకు వేయకుండానే ముందస్తుగా ప్రభుత్వ కళాశాలలో కట్టమని చెప్పటం దారుణమని వాపోయారు. తక్షణమే ముందస్తుగా ఫీజు కట్టించుకోవటం ఆపాలని డిమాండ్ చేశారు.

పరిష్కారానికి డీఆర్ఓ హామీ

డీఆర్ఓ సీతారామమూర్తి విద్యార్థుల దగ్గరికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రశాంతికి తెలియజేస్తామని, కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.జ్యోతిర్మయి, కనక, వాసు, సాహితి, నాగ చైతన్య, సురేష్ పాల్గొన్నారు.

వెంటనే పరిష్కరించాలి

కూటమి పాలనలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కలెక్టరేట్ వద్ద విద్యార్థులు నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు జమ అయ్యేదని, దానితో వారి చదువులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగాయన్నారు. కాని నేడు కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు న్యాయమైన డిమాండ్‌ల కోసం రోడ్లపైకి రావాలసి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తక్షణం విద్యార్థుల డిమాండ్‌లను నేరవేర్చాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజాల బాబు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవీ..

పెండింగులో ఉన్న 6,400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్‌కి సొంత భవనాలు నిర్మించాలని, హాస్టల్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని, మెస్ చార్జీలు రూ.3,000కి పెంచాలని, జీ.ఓ నెంబర్ 77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగంపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కొవ్వూరు డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించాలని, ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్సు డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకులు లేరని, తక్షణం వారిని నియమించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా డిమాండ్ చేశారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజాతో వాగ్వాదం చేస్తున్న డీఎస్పీ, పోలీసులు



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజాను నెట్టివేస్తున్న పోలీసు

విద్యార్థులందరూ రోడ్లపైకి వస్తారు

న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నామని, అటువంటి మమ్మల్ని ఉగ్రవాదులు లాగా లాగిపారేయడం ఎంత వరకు సబబు అని విద్యార్థులు నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ఎందుకింత భయమని ప్రశ్నిస్తున్నారు. 18 నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయుమని అడగడం తప్పా అని ఆవేదన చెందారు. తమ గొంతు నొక్కాలని చూస్తే రాష్ట్రంలో విద్యార్థులందరూ రోడ్లపైకి వస్తారని హెచ్చరించారు.

కూటమిలో కుంపటి

- బుచ్చయ్య రాజకీయాన్ని తప్పుబడుతున్న కూటమి నేతలు
- సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బహిష్కరించిన జనసేన, బీజేపీ



రాజమహేంద్రవరం రూరల్: కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్న కూటమి పార్టీల డొల్లతనం బయటపడింది. పేరుకి స్నేహగీతం ఆలపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కూటమి నాయకుల్లో అలుముకున్న అసంతృప్తి సహకార సొసైటీ త్రీమెన్‌కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం వేదికగా వెల్లడైంది. రూరల్ మండలంలో రెండురోజులుగా ఐదు సొసైటీల ప్రమాణ స్వీకారోత్సవాలు జరిగాయి. వీటిని కూటమిలోని జనసేన, బీజేపీలు బహిష్కరించడం ద్వారా తమ అసంతృప్తిని వెల్లడించాయి. కడియం మండలంలో మాదిరిగానే పదవులు పొందిన కూటమిలోని నాయకులను ఆకట్టుకోవడం ద్వారా అసంతృప్తి బయట పడకుండా గట్టెక్కేద్దాం అనుకున్న టీడీపీ నాయకులకు ఇతర పార్టీల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో కంగుతిన్నారు. రూరల్ మండలంలో ప్రకటించిన ఐదు సొసైటీల త్రీమెన్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాలకు జనసేన, బీజేపీ కీలక నాయకులను ఆహ్వానించకుండా రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ఒక్కరే ఒంటి చేత్తో కార్యక్రమాలను నిర్వహించేద్దాం అనుకున్నారు. కానీ బుచ్చయ్య మార్కు రాజకీయాన్ని గుర్తించిన రూరల్ జనసేన, బీజేపీ నాయకులు మొత్తం ఆ కార్యక్రమాలను బహిష్కరించి తమ పట్టుదలను ప్రదర్శించారు. తాజాగా సోమవారం జరిగిన హుకుంపేట సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి కమిటీలో సభ్యుడైన జనసేనకు చెందిన సాము వినాయక్ డుమ్మా కొట్టారు. రూరల్ మండలంలో ఐదు సొసైటీల్లో తమ పార్టీ తరఫున కనీసం ఒక్క డైరెక్టర్‌ను నియమించకపోవడంతో బీజేపీ గోరంట్లపై తీవ్ర అసంతృప్తితో ఉంది. కూటమిగా కొనసాగుదామని నిర్ణయించుకున్నాక ప్రతి కార్యక్రమంలోను తమ నాయకులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు పట్టుబడుతున్నారు. అలా చేస్తే తన రాజకీయ మనుగడకు ముప్పు వస్తుందన్న అనుమానంతో ఉన్న బుచ్చయ్యచౌదరి వారికి ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదు. వాస్తవానికి మంత్రి దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజులకు తగినంత సమయం ఉన్నప్పటికీ వాళ్లను ఆహ్వానించకుండా తనదే పైచేయిగా వ్యవహరిస్తున్న బుచ్చయ్య ఒంటెత్తు పోకడలను భవిష్యత్తుల్లో సాగనీయబోమని కూటమి నేతలు అంటున్నారు. దీంతో భవిష్యత్తులో రాజకీయ పరిణామాలు ఏ దిశగా సాగనున్నాయన్న చర్చ కూటమి నేతల మధ్య నడుస్తోంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

7న సత్యదేవుని దర్శన వేళల్లో మార్పులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుని ఆలయంలో భాద్రపద పౌర్ణిమ, సెప్టెంబర్ ఏడో తేదీ రాత్రి 9–50 గంటలకు ఏర్పడనున్న చంద్రగ్రహణం కారణంగా ఆ రోజు స్వామివారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఈఓ వి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ ఆదివారం ఉదయం పది గంటల వరకు మాత్రమే స్వామివారి వ్రతాలు, కేశఖండన టిక్కెట్లు విక్రయిస్తారు. స్వామివారి సర్వ దర్శనానికి భక్తులను మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే అనుమతిస్తారు. అనంతరం ఆలయం మూసివేస్తారు. సెప్టెంబర్ ఎనిమిదో తేదీ సోమవారం ఆలయం సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను వ్రతాలు, దర్శనాలు, ఇతర పూజా కార్యక్రమాలకు అనుమతిస్తారు.

మహిళ, ఆమె కుమారుడి అదృశ్యం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఓ వివాహిత, ఆమె కుమారుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్టి ప్రియకుమారి, ఆమె రెండేళ్ల కుమారుడు శేషగిరితో కలసి ఈనెల 23న ఇంటి నుంచి బయలుదేరి కోరుకొండ వెళ్లింది. అప్పటి నుంచి వారిద్దరి ఆచూకీ తెలియలేదు. దీనిపై భర్త రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. వీరి ఆచూకీ తెలిసిన వారు 94409 04830, 94409 04829 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఆదినాయకా... అందుకో మా పూజ

- **రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు**
- **ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన ఆలయాలు, ఉత్సవ మంటపాలు**
- **ఈ నెల 27 నుంచి** సెప్టెంబర్ 4 వరకూ వేడుకలు

అయినవిల్లి: ఆదినాయకా.. అందుకో మా పూజ అంటూ వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే వేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి.. ఇప్పటికే ఉత్సవ మంటపాల ఏర్పాటుకు అన్నీ ఏర్పాట్లూ చకచకా జరిగిపోతున్నాయి. ప్రసిద్ధి చెందిన అయినవిల్లి సిద్ధి వినాయకుని ఆలయం చవితి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా సిద్ధమైంది. బుధవారం వినాయక చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు విఘ్నేశ్వరుని సన్నిధిలో వేడుకలు నిర్వహించనున్నారు. దీని కోసం ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. గతేడాది కంటే అధికంగా భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ వర్గాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చలువ పందిళ్లు,



చవితికి ముస్తాబైన అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయం

విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వివిధ రంగులతో ఆలయ గోపురాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేక పుష్పాలు, కొబ్బరి, అరటి ఆకులు, కూరగాయలు వంటి వాటితో ఆలయ ప్రాంగణంలో అలంకరిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి చెప్పారు.

తొమ్మిది రోజులు.. ప్రత్యేక అభిషేకాలు

వినాయక చవితి సందర్భంగా బత్తాయి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, మామిడి వంటి వివిధ సీజనల్ పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేయనున్నారు. అనంతరం లక్ష గరిక పూజ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, హారతులు తదితర కార్యక్రమాలు తొమ్మిది రోజుల పాటు ఉంటాయని ఏసీ వెంకట దుర్గాభవాని తెలిపారు. ఈ రోజుల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేస్తామన్నారు. చవితి రోజున సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆలయ ప్రాంగణం వెలుపల మండపంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రోజూ తెల్లవారు జామున నాలుగు గంటలకు ఆలయం తెరుస్తారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం..



అయినవిల్లి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. చవితి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం. నవరాత్రుల్లో ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

–అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ ఈఓ, అయినవిల్లి

మేలుకొలుపు సేవ తదితర పూజల అనంతరం ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు నిత్య గణపతి హోమం, ఒంటి గంటకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రసాద నివేదన కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని మూషిక వాహనంపై మాఢవీధుల్లో ఊరేగిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంచ హారతులు ఇస్తారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ ఆలయం తెరిచి ఉంటుందని ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు తెలిపారు.

చెవిలో చెబితే.. కోర్కెలు తీర్చే స్వామి



బిక్కవోలులో గణపతి ఆలయ ముఖ ద్వారం

బిక్కవోలు: చెవిలో చెబితే కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందిన బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఆలయం చవితి వేడుకలకు ముస్తాబైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. 1,100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం కావడంతో చవితి ఉత్సవాలకు ఇక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ శ్రీలక్ష్మీగణపతి స్వామి ఏకశిలా మూర్తిగా దర్శనమిస్తారు. స్వామి విగ్రహం 10 అడుగుల పొడవు 6 అడుగుల వెడల్పున ఉంటుంది. స్వామివారికి తొండం కుడి వైపునకు తిరిగి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఈ విగ్రహం తూర్పు చాళుక్యుల కాలం నాటిదని పురావస్తు శాఖ అంచనా వేసింది. స్వామివారి చెవిలో తమ కోర్కెలు చెబితే తీరతాయనేది భక్తుల నమ్మకం. వినాయక



బిక్కవోలు ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

గతేడాది కంటే ఘనంగా..



ఆలయం చుట్టుపక్కల అంతా రేకుల షెడ్డు ఏర్పాటు చేశాం. గత ఏడాది కంటే ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్యూలైన్లు నిర్మించాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి చవితి రోజు మినహా మిగిలిన రోజుల్లో అన్నదానం ఉంటుంది.

–ఎ.భాస్కర్, దేవదాయ శాఖ ఈఓ, బిక్కవోలు గ్రూప్ ఆలయాలు

చవితి సందర్భంగా గణపతి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి దాటాక బుధవారం తెల్లవారు జామున 1.58 గంటలకు తీర్థపు బిందె సేవతో స్వామివారి చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం ఉదయం 11.04 కలశ స్థాపన చేశారు. ఈ వచ్చే నెల 6న మహాన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయి.



బిక్కవోలులో గణపతి స్వామివారు

మోటారు సైక్లిస్ట్‌పైకి దూసుకెళ్లిన ఆబోతులు

చికిత్స పొందుతూ మృతి



జంగా రామకృష్ణ (ఫైల్)

అల్లవరం: రెండు ఆబోతులు పొట్లాడుకుంటూ దారిని పోతున్న వ్యక్తిపైకి దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన అతను మృతి చెందిన సంఘటన అల్లవరం మండలం గుండెపూడిలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... గుండెపూడి పోతులవారిపేట గ్రామానికి చెందిన జంగా రామకృష్ణ (41) గురువారం రాత్రి దేవగుప్తం సెంటర్ నుంచి మోటారు సైకిల్‌పై పోతులవారిపేట వెళ్తుండగా గుండెపూడిలోని ఆంజనేయస్వామి వారి ఆలయాలకు సమీపంలో రోడ్డుపై రెండు ఆబోతులు హోరాహోరీగా పోట్లాడుకుంటున్నాయి. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న రామకృష్ణపైకి రెండు ఆబోతులు దూసుకువచ్చాయి. దీంతో రామకృష్ణ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. సయమానికి ఎవరూ లేకపోవడంతో రామకృష్ణపై ఆబోతులు వీరంగం సృష్టించి మరింత గాయాలు పాల్జేశాయి. కొద్ది సేపటికి రోడ్డుపై పడి ఉన్న రామకృష్ణను స్థానికులు గుర్తించి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలైన రామకృష్ణ తలకు శస్త్రచికిత్స చేశారు. అయితే ఆదివారం సాయంత్రం అతను మృతి చెందారు. ఈ ఘటనపై అల్లవరం ఎస్సై సంపత్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు.

గొడవను అడ్డుకోబోతే గొంతు కోసేశాడు

రాజానగరం: ఇద్దరు వ్యక్తులు గొడవపడి, కొట్లాటకు దిగడంతో వారిని సముదాయించే ప్రయత్నం చేస్తూ, ప్రాణాల మీదకు తెచ్చుకున్న వ్యక్తి ఉదంతమిది. రాజానగరం నడిబొడ్డున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ముత్యాలమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన గోళ్ల సాయి, అగత్తి సాయి అనే ఇద్దరు గొడవపడి, కొట్టుకున్నారు. గుడి వద్ద వినాయక చవితికి సంబంధించిన డెకరేషన్ పనులు చేస్తున్న నీలం లక్ష్మీప్రసాద్ దీనిని గమనించి, వారిద్దరినీ విడిపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో గోళ్ల సాయి తన వద్ద ఉన్న చాకుతో అతని గొంతును కోశాడు. దీంతో రక్తపు మడుగులో పడిఉన్న లక్ష్మీప్రసాద్‌ను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ప్రస్తుతం అతనికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.ప్రియకుమార్ తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

తుని: చోరీ కేసును తుని పోలీసులు ఛేదించారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన సతీష్ (అవంతికరెడ్డి) మూడేళ్ల కిందట తుని వచ్చి హిజ్రాలతో కలసి జీవిస్తున్నాడు. ఆడ లక్షణాలు కలిగిన సతీష్ మహిళ వేషధారణలో స్థానిక జాతీయ రహదారిపై ఉంటూ పలువురిని ఆకర్షిస్తూ డబ్బులు సంపాదించేవాడు. పండగలు, జాతర్లలో నృత్యాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్‌కు ఇన్‌స్టాగామ్‌లో ప్రశాంత్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. వీరిద్దరూ తుని పట్టణం 10వ వార్డు నిమ్మకాయలవారి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. సతీష్ తనను పెళ్లి చేసుకోవాలని ప్రశాంత్‌ను కోరాడు. ఆపరేషన్ చేయించుకుని పూర్తి హిజ్రాగా మారితేనే పెళ్లి చేసుకుంటానని ప్రశాంత్ చెప్పాడు. దీంతో ఆపరేషన్‌కు రూ. 5 లక్షలు అవసరమని తెలుసుకున్న సతీష్, ప్రశాంత్‌లు చోరీకి వ్యూహరచన చేశారు. వారు నివాసం ఉంటున్న ఇంటి పక్కనే నివాసం ఉంటున్న బాలేపల్లి సత్యవతి అనే వృద్ధురాలిని టార్గెట్ చేశారు. ఈ నెల 20న ఆమె తన ఇంటి వెనుక భాగంలో ఉండగా,



తునిలో చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

అప్పటికే అక్కడ మాటు వేసిన సతీష్, ప్రశాంత్‌లు ఆమె కళ్లలో కారం కొట్టారు. వృద్ధురాలి మెడలో ఉన్న ఐదు గ్రాముల పగడాల బంగారు గొలుసుతో పాటు చేతికున్న నాలుగున్నర తులాల బంగారు గాజులను తీసుకుని పరారయ్యారు. సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ సీఐ గీతారామకృష్ణ సమగ్ర దర్యాప్తు జరిపి ఆదివారం స్థానిక రైల్వే గెస్ట్‌హౌస్ వద్ద నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 7 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ గీతారామకృష్ణ, ఎస్సైలు విజయ్‌బాబు, పాపారావు, సిబ్బంది యాదవ్, శివయ్య, నాయుడులను డీఎస్పీ అభినందించారు.

బాలికను మోసగించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం రూరల్: ఓ బాలికను మోసగించిన ఘటనలో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. స్థానిక దివాన్‌చెరువుకు చెందిన ఓ బాలిక (14) ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి అక్కడే ఓ కర్రి పాయింట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బాలిక తల్లి పనిచేసే కర్రి పాయింట్‌కు తరచూ వెళ్లేది. అక్కడ పని చేసే పాండా రవికుమార్ తల్లి లేని సమయంలో బాలిక ఇంటికి వెళ్లి ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని గత ఏడాది డిసెంబర్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొద్ది రోజుల తర్వాత 16 ఏళ్ల బాలుడిని తన సోదరుడిగా పరిచయం చేశాడు. ఈ ఏడాది జనవరి నుంచి ఆ బాలుడు కూడా ఆమె ఇంటికి వెళ్లి కోరిక తీర్చాలని, లేకపోతే రవికుమార్‌తో ఉన్న సంబంధాన్ని బయట పెడతానని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భవతి అయ్యింది. ఆదివారం బాలికకు గర్భవిచ్ఛిత్తి కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేల్ నర్సుపై సస్పెన్షన్ వేటు



మోకా సందీప్

కాకినాడ క్రైం: ఓ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న మేల్ నర్స్ మోకా సందీప్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సందీప్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సోమవారం సందీప్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. విధులకు మద్యం తాగి రావడం, బాధ్యతాయుతమైన నర్సు విధుల్లో పనిచేస్తూ ఓ మహిళ నగ్న ఫొటోలు ఆమెకు తెలియకుండా తీయడం, వాటిని అడ్డు పెట్టి బ్లాక్‌మెయిల్ చేయడం, బాధితురాలిని కొట్టి అఘాయిత్యానికి పాల్పడడం, ఆ ఫొటోలను ఆమె కుమారుడికి పంపడం తద్వారా ఆ బాలుడిని ఆత్మహత్యకు పురిగొల్పడం అంశాలు ఎఫ్ఐఆర్‌లో పొందుపరచడంతో అవే అంశాల ప్రాతిపదికన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడన్న సహ మేల్ నర్సుల ఫిర్యాదుతో అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఎక్కువ రోజులు సెలవులో ఉంటున్న సందీప్‌కు అసలు అన్నాళ్లు సెలవు ఎవరు ఇస్తున్నారు, అలాగే సందీప్‌కు సహాయకారిగా ఉంటూ అతడి సెలవు దరఖాస్తులను అధికారులకు ఎవరు అందిస్తున్నారనే అంశాలపై విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

నిద్రపోతూ తమిళనాడు వాసి మృతి

కరప: బతుకు దెరువు కోసం బెల్లం వ్యాపారం చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు వ్యాన్‌లో నిద్రిస్తూ మృతి చెందిన ఘటన కరప మండలం పెనుగుదురు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా మండల కేంద్రమైన అయ్యనరుతు గ్రామానికి చెందిన వెలువెత్తు మురుమత్తు, ముత్తు, అల్విన్, పెరుమాళ్ల ముత్తయ్య పెరుమాళ్లు వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ తాటిబెల్లం కుందులు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ బెల్లం వ్యాపారం చేస్తున్నారు. ఇలా పెనుగుదురు గ్రామానికి వచ్చిన సదరు తమిళులు చుట్టుపక్కల గ్రామాల్లో బెల్లం అమ్మి రాత్రి 8 గంటల సమయంలో పెనుగుదురులోని పెట్రోల్ బంక్ వద్ద బొలెరో వ్యాన్ పెట్టి, నలుగురు కలసి మద్యం తాగి, భోజనం చేసి వ్యాన్‌లో నిద్రపోయారు. ఇందులో ఒకరు పెరుమాళ్ల ముత్తయ్య సోమవారం ఉదయం 5 గంటల సమయంలో టీ పట్టుకొచ్చి వెలుముత్తు మురుమత్తును లేపినా లేవలేదు. వెంటనే అతడిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ముత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదుచేశారు.

మొక్కలు నరికేశారని ఫిర్యాదు

రాజానగరం: మండలంలోని కానవరంలో తన పదెకరాల్లో నాటిన పామాయిల్ మొక్కలను కత్తులతో మొదళ్ల వరకు నరికించి, తీవ్ర నష్టం కలిగించారని దివాన్‌చెరువుకు చెందిన వంక మల్లికార్జున స్వామి (మల్లిబాబు) స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన సంగిశెట్టి వీరవెంకట్రావు, అతని అనుచరులతో ఆదివారం రాత్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడన్నారు. తనకు వీరవెంకట్రావుతో కొంతకాలంగా నడుస్తున్న వివాదాలను ప్రస్తావిస్తూ, వాస్తవాలను పరిశీలించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పామాయిల్ మొక్కలను నరికేసిన దృశ్యం

వ్యసనాలకు అలవాటు పడి చోరీలు

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

నిడదవోలు: వ్యసనాలకు అలవాటు పడిన యువకులు చోరీల బాట పట్టారు. చివరకు పోలీసులకు చిక్కడంతో కటకటాల పాలయ్యారు. దీనికి సంబంధించి నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ కథనం ప్రకారం.. వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న నిడదవోలు పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన కోలా అభిషేక్ (నవీన్ కుమార్), అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన గుద్దటి రాజులను నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో సోమవారం సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు అరెస్ట్ చేశారు. ఆ ఇద్దరు నిందితులు చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు బానిసై 2014 నుంచి మధురవాడ, వైజాగ్, పాడేరు, పెందుర్తి పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉండేవారు. మొదట తుని, కంచర్లపాలెం పోలీసులు జువైనల్ హోమ్‌కు పంపించారు. అనంతరం నిందితులు గణేష్, రఘు, రమణ, బాబు ద్వారా దొంగతనాలకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యారు. ఇద్దరూ కలసి చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో చోరీలు చేసేవారు. తర్వాత వైన్ షాపుల తాళాలు బద్దలుకొట్టి లోపలకు చొరబడి డబ్బులు, మద్యం సీసాలు దొంగిలించేవారు. ఇవే కాకుండా ఆలయాల్లో రాత్రి సమయాల్లో తాళాలు బద్దలు కొట్టి డబ్బులు, బంగారు ఆభరణాలు, వెండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిడదవోలు సీఐ తిలక్

వస్తువులు అపహరించేవారు. వీరిపై వివిధ జిల్లాల్లో సుమారు 30 పైగా పాత కేసులు ఉన్నాయి. వివిధ కేసుల్లో అరెస్టయి మళ్లీ బయటకు వచ్చి ఈ మధ్యకాలంలో 7 దొంగతనాలకు పాల్పడ్డారు. నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. పెందుర్తిలో 2, పాడేరు, వి.మాడుగుల, మండపేట, రాజానగరంలలో ఒక్కొక్కటి చొప్పున చోరీ కేసులు వీరిపై ఉన్నాయి. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ చెప్పారు. ఈ కేసులను ఛేదించిన సీఐ తిలక్, సమిశ్రగూడెం రూరల్ ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు, పట్టణ ఎస్సై జగన్మోహనరావు, సిబ్బంది జి.రామారావు, జె.రెహ్మాన్, జి.సాంబయ్య, ఎస్వీ రామాంజనేయులను కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అభినందించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ డెయిరీ ఫామ్ సెంటర్‌కు చెందిన వెంకటరత్నం (51) తన భర్త సత్యనారాయణతో టీవీఎస్ మోపెడ్‌పై వాకలపూడిలోని కోరమాండల్ ఆస్పత్రిలో వైద్యం కోసం బయలుదేరారు. వలసపాకల గ్రామం గంగరాజునగర్‌లో సూర్య కార్ వాష్ వద్దకు వచ్చేసరికి వెనక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఇద్దరూ కింద పడిపోయారు. వెంకటరత్నంపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.